క్లుప్తంగా

పులిచింతల నుంచి 12 గేట్ల ద్వారా నీటి విడుదల

మేళ్లచెరువు : చింతలపాలెం మండలంలోని పులిచింతల ప్రాజెక్టుకు బుధవారం రాత్రి వరకు భారీగా వరద వస్తుండడంతో ప్రాజెక్టులోని నీటి మట్టం పూర్తిస్థాయికి చేరినట్లు అధికారులు తెలిపారు. ప్రాజెక్టుకు 3,90,800 క్యూసెక్కుల వరద వస్తుండగా 12 గేట్లను నాలుగు మీటర్ల మేర ఎత్తి 3,76,286 క్యూసెక్కుల నీటిని అధికారులు దిగువకు వదులుతున్నారు.

ఆలయానికి వంట సామగ్రి బహూకరణ



వంట సామగ్రి అందజేస్తున్న గణేష్

హుజూర్‌నగర్ : మండలంలోని బూరుగడ్డలో గల శ్రీ ఆదివరాహ లక్ష్మీనరసింహ వేణుగోపాలస్వామి దేవస్థానానికి నర్సాయిగూడెంకు చెందిన ఊదల గణేష్ రూ.11 వేల విలువ గల వంట సామగ్రిని బహూకరించారు. బుధవారం వాటిని ఆలయ అధికారులకు అందజేశారు. అర్చకులు, ధర్మకర్తలు సిబ్బంది పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో వైద్య పరీక్షలు



వైద్య శిబిరంలో డాక్టర్లు, ప్రజలు

నేరేడుచర్ల : ఆరోగ్య మహిళ – శక్తివంతమైన కుటుంబం కార్యక్రమంలో భాగంగా బుధవారం నేరేడుచర్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చర్మవ్యాధి నిపుణులు డాక్టర్ తేజ స్వరూప్ 52 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యురాలు డాక్టర్ పున్న నాగిని, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ సల్వాది శ్రీనివాస్, డీఈఓ జ్యోతి, సూపర్‌వైజర్ ధనమ్మ, వెంకటేశ్వర్లు, ఆశా వర్కర్లు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.


డప్పు కళాకారుడు సతీష్‌కు విజయదశమి పురస్కారం



డప్పు కళాకారుడు అమరవరపు సతీష్‌కు పురస్కారం అందజేస్తున్న స్వప్నకిషోర్

గరిడేపల్లి : మండలంలోని అప్పన్నపేట గ్రామానికి డప్పు కళాకారుడు అమరవరపు సతీష్‌కు విజయదశమి పురస్కారం లభించింది. హైదరాబాద్‌లోని అబిడ్స్‌లో గల తెలంగాణ సారస్వత పరిషత్ భవన్‌లో సాహితీ కళా సేవా సమితి ఆధ్వర్యంలో బతుకమ్మ, విజయదశమి పురస్కారాల –2025 వ్యవస్థాపక అధ్యక్షురాలు స్వప్న కిషోర్ ఉల్లెందుల అధ్యక్షతన జరిగిన పురస్కారాల ప్రదానోత్సవంలో బద్దం రఘువీర్‌రెడ్డి, వంశీకృష్ణప్రతాప్, కేశవరాజ్ వెంకట ప్రభాకర్‌రావు, రాంకీ వెలగాడ, మీడిశెట్టి వెంకటేశ్వర్లు చేతుల మీదుగా సతీష్ పురస్కారం అందుకున్నారు. వివిధ రంగాల్లో విశేష కృషి చేసిన వారికి ప్రతి ఏడాది విజయదశమి పురస్కారాలు అందజేస్తున్నామని, అమరవరపు సతీష్‌ను ఉత్తమ డప్పు కళాకారుడిగా గుర్తించి ఈ పురస్కారం అందజేసినట్లు స్వప్న కిషోర్ ఉల్లెందుల తెలిపారు. ఈ సందర్భంగా సతీష్‌కు మ్యూజిక్ అకాడమీ బృందం, గ్రామస్తులు అభినందనలు తెలిపారు.

రూ.10 వేల ఆర్థికసాయం



మృతురాలి కుటుంబానికి ఆర్థికసాయం అందజేస్తున్న నాయకులు

హుజూర్‌నగర్ : పట్టణంలోని శ్రీనగర్ కాలనీలో ఇటీవల మృతి చెందిన పిల్లుట్ల బుదేవమ్మ కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ 19వ వార్డు అధ్యక్షుడు వి.కృష్ణగౌడ్ సూచన మేరకు తెలంగాణ విద్యా సమితి రాష్ట్ర అధ్యక్షుడు పెండెం తారక్‌గౌడ్ మిత్రులు రూ.10 వేల ఆర్థిక సాయం అందజేశారు. సదరు నగదును బుధవారం పార్టీ మైనార్టీ సెల్ నియోజకవర్గ నాయకుడు షేక్ సైదా.. మృతురాలి కుమారులు పిల్లుట్ల లింగయ్య, సైదులుకు అందజేశారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ యల్లమ్మ వెంకటేశ్వర్లు, నర్సింహ, రమ్య, ప్రశాంత్, నాగ, నాగుల్‌మీరా, తదితరులు పాల్గొన్నారు.

కలకోవ జెడ్పీ ఉన్నత పాఠశాలలో చోరీ

మునగాల : మునగాల మండలం కలకోవ గ్రామ జెడ్పీహెచ్‌ఎస్‌లో మంగళవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. పాఠశాలలోని ప్రధానోపాధ్యాయుడి గదితో పాటు, స్టాఫ్‌రూం, సైన్స్ ల్యాబ్, తొమ్మిదో తరగతి గదిలో ఉన్న ఆరు బ్యాటరీలు, సౌండ్ సిస్టమ్స్, గ్యాస్ బండ చోరీకి గురైనట్లు గుర్తించామని ప్రధానోపాధ్యాయుడు తేజోరామ్ తెలిపారు. బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు ప్రధానోపాధ్యాయుడు పేర్కొన్నారు.

అధ్వానంగా అంతర్గత రహదారులు

- మున్సిపాలిటీలో మట్టి దారులను తలపిస్తున్న సీసీ రోడ్లు
- రోడ్లపై వర్షపు నీరు నిలుస్తుండడంతో ఇబ్బందులు పడుతున్న పట్టణవాసులు



నూతన మున్సిపాలిటీ కార్యాలయం సమీపంలో సీసీ రోడ్డు దుస్థితి

కోదాడ : కోట్ల రూపాయల ఖర్చు చేసి పట్టణంలో నిర్మించిన సీసీ రోడ్లు మట్టి రోడ్లను తలపిస్తున్నాయి. నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా, సరైన పర్యవేక్షణ లేకుండా వేసిన ఈ రోడ్లు ప్రస్తుతం పట్టణవాసులకు నిత్యం నరకం చూపిస్తున్నాయి. మిషన్ భగీరథ పైప్ లైన్ కోసం తవ్విన గాడులతో పాటు పలు క్రాసింగ్‌ల వద్ద నిర్మించిన కల్వర్టులు ఎగుడు, దిగుడుగా ఉండడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. మరికొన్ని చోట్ల డ్రెయిన్స్ కన్నా సీసీ రోడ్లు తక్కువ ఎత్తులో ఉండడంతో మురుగు నీరు, వర్షపు నీరు రోడ్ల మీదకు చేరి రాకపోకలకు తీవ్ర ఇబ్బంది కలుగుతుంది.

అడుగుకో గుంత..

కోదాడ మున్సిపాలిటీ పరిధిలోని 35 వార్డుల్లో ఎక్కడ చూసినా ఇదే పరిస్థితి. అనంతగిరి రోడ్డులోని మాజీ సర్పంచ్ తమ్మర వెంకటేశ్వరరావు ఇంటి నుంచి ఖమ్మం రోడ్డు వరకు ఉన్న మేకల అభినవ్ వీధిలో అడుగుకో గుంత ఉంది. పట్టణంలో ఇది ముఖ్యమైన రహదారి. ఈ రోడ్డులో రెండు విడతలు ప్రయాణం చేస్తే వైద్యుడి వద్దకు వెళ్లాల్సిందేనని ఈ ప్రాంత ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదే రోడ్డులో శ్రీనివాసనగర్ వద్ద కోదాడ మాజీ ఎమ్మెల్యేలు చందర్‌రావు, బొల్లం మల్లయ్యయాదవ్ ఇళ్లతో పాటు ప్రస్తుత ఎమ్మెల్యే పద్మావతి నివాసం ఉంది. అయినప్పటికీ అధికారులు ఈ రోడ్డు మరమ్మతులు పట్టించుకున్న పాపాన పోవడం లేదు.

రోడ్లపైనే ర్యాంపుల నిర్మాణం..

పట్టణంలో మున్సిపాలిటీ టౌన్ ప్లానింగ్, ఇంజనీరింగ్, శానిటేషన్ విభాగాల మధ్య సమన్వయ లోపం ప్రజలను ఇబ్బందుల పాలు చేస్తుంది. ఇళ్ల నిర్మాణ సమయంలో టౌన్ ప్లానింగ్ అధికారులు పట్టించుకోకపోవడంతో పలువురు తమ ఇంటి ర్యాంపులను నడిరోడ్డు మీద వరకు నిర్మిస్తున్నారు. ఎదురెదురు ఇళ్ల వారు ఇలా చేయడంతో అసలే ఇరుకు రోడ్లు ఇంకా ఇరుకుగా మారాయి. ఇళ్ల ముందు ఇష్టం వచ్చినట్లు ఎత్తుగా నిర్మాణాలు చేపడుతుండడంతో రోడ్లమీద నీరు నిలిచి రాకపోకలకు ఇబ్బందిగా మారుతోంది. ఇటీవల కోదాడ మున్సిపాలిటీ కార్యాలయాన్ని నయానగర్‌కు మార్చారు. దీనికి సమీపంలో సీసీ రోడ్డుమీద మోకాలిలోతు నీరు నెలల తరబడి ఉంటున్నా నిత్యం ఇక్కడి నుంచే రాకపోకలు సాగిస్తున్న మున్సిపల్ అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదని ఈ ప్రాంత వాసులు ఆరోపిస్తున్నారు. తేజ టాలెంట్ పాఠశాల నుంచి సాయికృష్ణ థియేటర్ వరకు ఉన్న రోడ్డు పరిస్థితి కూడా ఇదే విధంగా ఉంది.

మరమ్మతులు చేయించాలి



పట్టణంలో సీసీ రోడ్లు అధ్వానంగా మారాయి. రోడ్డుపై అడుగుకోగుంత ఉండడంతో ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తే నడుము నొప్పులు వస్తున్నాయి. మున్సిపాలిటీ అధికారులు, ప్రజాప్రతినిధులు కల్పించుకొని వెంటనే మరమ్మతులు చేయించి ప్రజల ఇబ్బందులను తొలగించాలి.

– గుడుగుంట్ల శంకర్, కోదాడ

బీఆర్‌ఎస్ గెలుపునకు కృషిచేయాలి



నడిగూడెం : పార్టీ నాయకుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్

- మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్

నడిగూడెం : స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ గెలుపునకు పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని కోదాడ మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ అన్నారు. బుధవారం నడిగూడెం మండల కేంద్రంలో జరిగిన బీఆర్‌ఎస్ పార్టీ మండల నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల్లో గ్రామాల్లో కలిసి వచ్చే పార్టీలతో పొత్తులు పెట్టుకొని ఎంపీటీసీ, జెడ్పీటీసీ, సర్పంచ్ స్థానాలు కైవసం చేసుకోవాలని అన్నారు. గ్రామాల్లో ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకతను ఉపయోగించుకోవాలని, అమలు కాని గ్యారంటీలను ప్రజలకు తెలియజేసి వాటిని ఓట్ల రూపంలో మన వైపు తిప్పుకోవాలని సూచించారు. రానున్న కాలం మనదే అని, కార్యకర్తలు, నాయకులు అధైర్య పడవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు పల్లా నర్సిరెడ్డి, మండల, గ్రామ నాయకులు అనంతుల ఆంజనేయులు, బోనగిరి ఉపేందర్, గార్లపాటి శ్రీనివాస్‌రెడ్డి, మారుతి ఉపేందర్, దేవబత్తిని సురేష్ ప్రసాద్, మహేష్, నాగన్న, సుధాకర్, శ్రీనివాస్, బొల్లం శ్రీనివాస్, నాగేశ్వరరావు, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

'స్థానిక' ఎన్నికల్లో సత్తా చాటాలి

మునగాల : త్వరలో జరుగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ సత్తా చాటాలని పార్టీ కోదాడ నియోజవర్గ ఇంచార్జి, మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. బుధవారం మండల కేంద్రంలోని వాసవీ భవన్‌లో నిర్వహించిన బీఆర్‌ఎస్ పార్టీ ఎన్నికల సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆరు గ్యారంటీలు 420 హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం అవి అమలు చేయకుండా ప్రజలను నిలువునా మోసం చేసిందని ఎద్దేవా చేశారు. ప్రజలకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేస్తున్న మోసాలను ప్రజలకు చేరవేయాలని కార్యకర్తలను కోరారు. భవిష్యత్‌లో తెలంగాణలో రాబోయేది కేసీఆర్ పాలనేనన్నారు. ప్రభుత్వం పట్ల ప్రజలలో తీవ్ర వ్యతిరేకత ఉందని, కేసీఆర్ పాలన రావాలంటే ఈ స్థానిక ఎన్నికల్లో పునాదులు వేయాలని కోరారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో గ్రామాలలో బీఆర్‌ఎస్ పార్టీకి ప్రజలు బ్రహ్మరథం పట్టేందుకు సిద్ధంగా ఉన్నారని అన్నారు. పార్టీ మండల అధ్యక్షుడు తొగరు రమేష్ అధ్యక్షత వహించిన ఈ సమావేశంలో పార్టీ మండల నాయకులు కందిబండ సత్యనారాయణ, సుంకర అజయ్‌కుమార్, తొగరు సీతరాములు, వల్లపురెడ్డి రామిరెడ్డి, కోల ఉపేందర్‌రావు, బాలాజీ ప్రదీప్, రాణి, ఉడుం కృష్ణ, ఎల్పీ రామయ్య, కుపిరెడ్డి నవీన్‌రెడ్డి, లక్యా నాయిక్, గడ్డం లింగయ్య యాదవ్, ఎల్.నాగబాబు, సొంపంగు సైదులు, జిల్లేపల్లి ప్రసాద్, గ్రామశాఖ అధ్యక్ష, కార్యదర్శులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గాంధీ పార్క్‌లో 'స్వచ్ఛతా హీ సేవా'



గాంధీ పార్క్‌లో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, సిబ్బంది

హుజూర్‌నగర్ : పట్టణంలో బుధవారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గాంధీ పార్క్‌లోని వాకింగ్ ట్రాక్, ఓపెన్ జిమ్ పరిసర ప్రాంతాల్లో చెత్త, పిచ్చి మొక్కలను తొలగించి డంపింగ్ యార్డ్‌కు తరలించారు. అనంతరం మహాత్మా గాంధీ విగ్రహాన్ని కడిగి శుభ్రం చేశారు. ఏక్ దిన్ ఏక్ గంట ఏక్ సాత్ కార్యక్రమంలో శ్రమదానం చేసిన మున్సిపల్, మెప్మా సిబ్బందికి శాలువతో సన్మానించి ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కె.శ్రీనివాసరెడ్డి, సానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎం.అశోక్, కార్యాలయ సిబ్బంది శ్రీధర్, రంగారావు, రామారావు, రాజశేఖర్, వార్డు ఆఫీసర్లు, శానిటరీ జవాన్లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్నికల విధులు సక్రమంగా నిర్వహించాలి



హుజూర్‌నగర్ : శిక్షణలో మాట్లాడుతున్న ఆర్డీఓ శ్రీనివాసులు

హుజూర్‌నగర్ : ఎన్నికల విధులు సక్రమంగా నిర్వహించాలని ఆర్డీఓ శ్రీనివాసులు అన్నారు. బుధవారం హుజూర్‌నగర్ వీవీఎం స్కూల్‌లో ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల పీఓ, ఏపీఓలకు శిక్షణ నిర్వహించారు. ఎన్నికల విధులపై మాస్టర్ ట్రైనర్లు వారికి శిక్షణ ఇచ్చారు. ఎంపీడీఓ లావణ్య, నాయబ్ తహసీల్దార్ కత్తుల నాగేందర్, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల విధులు పకడ్బందీగా నిర్వర్తించాలి

మఠంపల్లి : ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల విధులు పకడ్బందీగా నిర్వర్తించాలని ఎంపీడీఓ వెంకటాచారి అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో భాగంగా బుధవారం మండల కేంద్రమైన మఠంపల్లిలోని ఓ ఫంక్షన్ హాల్‌లో పీఓలు, ఏపీఓలకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఎంఈఓ పి.వెంకటాచారి, టీఓటీలు, ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

పీఓ, ఏపీఓలకు శిక్షణ

నడిగూడెం : త్వరలో ఎంపీటీ, జెడ్పీటీసీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో బుధవారం నడిగూడెం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో పీఓ, ఏపీఓలకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మల్సూర్‌నాయక్ పాల్గొని మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికలను సజావుగా నిర్వహించేందుకు పీఓ, ఏపీఓలు శిక్షణను సద్వినియోగం చేసుకోవాలన్నారు. నిబంధనలకు లోబడి సిబ్బంది తమ విధులను నిర్వహించాల్సి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్పీ రమేష్, కత్తి వెంకటేశ్వర్లు, పాదిళ్ల శ్రీనివాస్, సురేష్, సీఆర్పీలు నందిగామ రామారావు, రాజుల గురుస్వామి, గోవర్ధన్, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది రాజశేఖర్ పాల్గొన్నారు.

మేళ్లచెరువులో..

మేళ్లచెరువు : ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల నేపథ్యంలో బుధవారం మండల కేంద్రంలోని రైతువేదికలో మండలంలోని 62 మంది పీఓ, ఏపీఓ లకు శిక్షణ నిర్వహించారు. ఎన్నికల్లో నిర్వహించాల్సిన పద్ధతులను డిజిటల్ స్క్రీన్ ద్వారా వివరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రాజేందర్‌రెడ్డి, ఎంపీడీఓ ఖాజా అస్గర్‌అలీ, ఎంఈఓ వెంకటరెడ్డి, ఎంపీఓ జగదీష్‌కుమార్, శిక్షణ సిబ్బంది ఉపేందర్, వీరయ్య, జాఫర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సేవకు ప్రతి రూపం.. వాసవి, వనితా క్లబ్‌లు



క్లబ్ మాజీ కార్యవర్గ సభ్యులను సన్మానిస్తున్న సుమంత్, తదితరులు

నేరేడుచర్ల : సేవకు ప్రతి రూపం వాసవి, వనిత క్లబ్‌లని నేరేడుచర్ల వాసవి, వనితా క్లబ్‌ల అధ్యక్షులు ఐతా సుమంత్, గరిణే జ్యోతి అన్నారు. బుధవారం స్థానిక రైస్ మిల్లర్స్ అసోసియేషన్ భవనంలో వాసవి క్లబ్ ఆవిర్భావ దినోత్సవం నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ క్లబ్ వ్యవస్థాపకుడు దివంగత కల్వకుంట్ల చంద్రశేఖర గుప్తా ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ పాటుపడాలన్నారు. ఈ సందర్భంగా వాసవి క్లబ్ గవర్నర్, విద్యా సంకల్ప్ రాచకొండ విజయలక్ష్మీతో పాటు డిస్ట్రిక్ పీఆర్‌ఓ గరిణే అరుణకుమారి, డిస్ట్రిక్ ఇంచార్జి కందిబండ శ్రీనివాస్ మాజీ కార్యవర్గ సభ్యులు వీరవెల్లి శ్రీలత, రాజకోండ శ్రీనివాస్, గరిణే వాసు, చెరుకు రాము, చెరుకు కవిత, ఊర్మిల, రాధిక, నటరాజ్, అశోక్, సత్యనారాయణ, సత్యంను సన్మానించి జ్ఞాపికలు అందించారు.

భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



నేరేడుచర్ల: మాట్లాడుతున్న యారవ శ్రీనివాస్

గరిడేపల్లి : భవన నిర్మాణ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఐఎఫ్‌టీయూ జిల్లా అధ్యక్షుడు కామళ్ల నవీన్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని గడ్డిపల్లి గ్రామంలో భవన నిర్మాణ కార్మిక సంఘం గ్రామ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 7 నుంచి 10వ తేదీ వరకు కలెక్టర్ కార్యాలయం ఎదుట నిర్వహించబోయే ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. అనంతరం ధర్నా కరపత్రం ఆవిష్కరించారు. కార్యక్రమంలో గుంజా నరసింహారావు, నరేష్, పెద్ద లింగయ్య, విజిత్, జానయ్య, లింగయ్య, నాగేశ్వరావు, ఏడుకొండలు, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

కార్మికులందరికీ గుర్తింపు కార్డులు ఇవ్వాలి

నేరేడుచర్ల : భవన నిర్మాణ కార్మికులందరికీ వెల్ఫేర్ బోర్డు గుర్తింపు కార్డులు అందించాలని భవన నిర్మాణ కార్మిక సంఘం (సీఐటీయూ అనుబంధం) నేరేడుచర్ల పట్టణ అధ్యక్షుడు యారవ శ్రీనివాస్ అన్నారు. బుధవారం నేరేడుచర్లలోని సంఘం కార్యాలయంలో నిర్వహించిన భవన నిర్మాణ కార్మిక సంఘం సమావేశంలో ఆయన మాట్లాడారు. నిర్మాణ రంగంలో నిత్యం ప్రమాదాలకు గురవుతూ పనిచేస్తున్న కార్మికులకు ప్రభుత్వ భరోసా కల్పించాలన్నారు. సంక్షేమ బోర్డు ద్వారా ప్రమాద బీమా రూ.10 లక్షలు, సాధారణ మరణ బీమా రూ.లక్షలకు పెంచాలన్నారు. వెల్ఫేర్ బోర్డులోని నిధులు పక్కదారి పట్టకుండా కార్మికుల సొమ్ము కార్మికులకు మాత్రమే ఖర్చు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. పెండింగ్‌లో ఉన్న క్లైమ్‌లకు తక్షణమే నిధులు మంజూరు చేయాలన్నారు. 60 ఏళ్లు దాటిన ప్రతి కార్మికుడికి రూ.5వేల పింఛన్లు ఇవ్వాలన్నారు. వెల్ఫేర్ బోర్డు కార్డులను కార్మికులు రెన్యూవల్ చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో సంఘం ప్రధాన కార్యదర్శి సత్తార్, కోశాధికారి రవీందర్, చిన ఖాజావలి, కోటేశ్వర్‌రావు, షరీఫ్, అజయ్‌కుమార్, భిక్షం, సైదా, ఖరీముల్లా, మట్టయ్య, నాగరాజు, నాగుల్‌మీరా, వెంకన్న, శ్రీను, శివ తదితరులు ఉన్నారు.



గరిడేపల్లి : కరపత్రం ఆవిష్కరిస్తున్న ఐఎఫ్‌టీయూ నాయకులు

కొనసాగుతున్న దేవీ శరన్నవరాత్రోత్సవాలు



నేరేడుచర్ల : శివాలయంలో అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు



మోతె : దుర్గామాత ఊరేగింపులో కోలాటం వేస్తున్న మహిళలు

హుజూర్‌నగర్ : పట్టణంలో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా స్వయంవ్యక్త శ్రీ కనకదుర్గమ్మ ఆలయంలో బుధవారం అమ్మవారు మహిషాసుర మర్దినిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ పూజారులు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు, కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

ఘనంగా సరస్వతి అమ్మవారి ఊరేగింపు

హుజూర్‌నగర్ : పట్టణంలోని పలు వార్డుల్లో దేవీశరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం పట్టణంలోని సరస్వతీ దేవి ఆలయంలో అమ్మవారిని ప్రత్యేంగా ఏర్పాటు చేసిన పల్లకీలో ఊరేగించారు. ఈ సందర్భంగా మహిళలు నిర్వహించిన కోలాట ప్రదర్శన ఆకట్టుకుంది.

విజయదుర్గ, అన్నపూర్ణ విశ్వేశ్వర ఆలయాల్లో..

నేరేడుచర్ల : దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం నేరేడుచర్లలోని విజయదుర్గ ఆలయం, అన్నపూర్ణ విశ్వేశ్వర ఆలయంలో అమ్మవారు మహిషాసురమర్దిని అవతారంలో పూజలు అందుకున్నారు. ఆలయ ప్రధాన అర్చకులు మొలుగు శ్రీనివాసాచార్యులు, ఉగ్రదండి శివ ప్రసాదశర్మ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీల చైర్మన్లు కొణతం ఆదిరెడ్డి, రాచకొండ రామకోటేశ్వర్‌రావు, కొణతం చిన వెంకట్‌రెడ్డి, నాగండ్ల శ్రీధర్, సూరిబాబు, గణేష్‌రెడ్డి, సురేష్‌రెడ్డి, కృష్ణారెడ్డి, రాంరెడ్డి, వెంకటేశ్వర్లు, కిశోర్, వెంపటి హరి, భరత్, లక్ష్మీనారాయణ, శ్రీను తదితరులున్నారు.



చిలుకూరులో మహిషాసుర మర్దిని అవతారంలో కనకదుర్గమ్మ



కోదాడ: పటేల్‌నగర్‌లో మహిషాసురమర్దిని అలంకరణలో అమ్మవారు

చిలుకూరులో..

చిలుకూరు : శ్రీ దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా చిలుకూరు మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన మండపంలో ప్రతిష్ఠించిన కనకదుర్గమ్మ అమ్మవారు బుధవారం మహిషాసుర మర్దిని అవతారంలో దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా భక్తులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

దుర్గామాత శోభాయాత్ర

మోతె : దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మోతె మండల కేంద్రంలో ప్రతిష్ఠించిన దుర్గామాత అమ్మవారి శోభాయాత్రను బుధవారం ఘనంగా నిర్వహించారు. అనంతరం స్థానిక రత్నాల చెరువులో అమ్మవారి విగ్రహాన్ని నిమజ్జనం చేశారు. ఊరేగింపులో భక్తులు కోలాటం, నృత్యాలు చేశారు.

మఠంపల్లిలో కనకదుర్గమ్మ గ్రామోత్సవం

మఠంపల్లి : దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలోని కనకదుర్గా దేవాలయంలో బుధవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు అన్నదానం చేశారు. సాయంత్రం అమ్మవారి గ్రామోత్సవం గావించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు సోమయాజుల సూర్యనారాయణమూర్తిశాస్త్రి, పీఏసీఎస్ మాజీ చైర్మన్ కంటు లక్ష్మయ్య, మాజీ ఉపసర్పంచ్ జాల కిరణ్‌యాదవ్, గ్రంథాలయ కమిటీ చైర్మన్ బీవీ రామారావు, బీఆర్‌ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు రామచంద్రయ్య, మన్నెం నర్సిరెడ్డి, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



హుజూర్‌నగర్ : సరస్వతీదేవి అమ్మవారిని ఊరేగిస్తున్న భక్తులు



హుజూర్‌నగర్ : అమ్మవారి పూజలో పాల్గొన్న సీఐ చరమందరాజు, ఎస్‌ఐ, భక్తులు



మఠంపల్లి : అమ్మవారి ఊరేగింపులో పాల్గొన్న గ్రామస్తులు

35 మంది బైండోవర్

హుజూర్‌నగర్ : నియోజకవర్గ వ్యాప్తంగా గతంలో ఘర్షణలకు పాల్పడిన 35 మందిని దసరా పండుగ సందర్భంగా ఎలాంటి అల్లర్లు జరగకుండా ముందు జాగ్రత్త చర్యగా బైండోవర్ చేసినట్లు సీఐ చరమందరాజు బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గ ప్రజలకు దసరా పండుగ శుభాకాంక్షలు తెలిపారు. దసరా పండుగను, గాంధీ జయంతిని ప్రశాంతంగా జరుపుకోవాలని ఆయన సూచించారు. స్థానిక సంస్థల ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున ఎన్నికల నియమావళికి అనుగుణంగా నడుచుకోవాలని ఆయన కోరారు.

కాంగ్రెస్, బీఆర్‌ఎస్ నాయకుల బైండోవర్

గరిడేపల్లి : స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో శాంతి భద్రతల పరిరక్షణ కోసం మండలంలోని కుత్బుషాపురం గ్రామానికి చెందిన పలువురు కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీ నాయకులను బుధవారం గరిడేపల్లి ఎస్‌ఐ చలికంటి నరేష్.. తహసీల్దార్ సమక్షంలో బైండోవర్ చేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ నరేష్ మాట్లాడుతూ.. ఎన్నికలు శాంతియుతంగా సజావుగా జరిగేలా పోలీసులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. రాజకీయ వర్గాల మధ్య ఎలాంటి విభేదాలు, గొడవలు తలెత్తకుండా పర్యవేక్షించనున్నట్లు స్పష్టం చేశారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

అధ్యక్షుడి నియామకంపై హర్షం

చిలుకూరు : ఎస్టీయూ సూర్యాపేట జిల్లా అధ్యక్షుడిగా బంధం వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శిగా పాలూరి అంజయ్య నియమితులవ్వడం పట్ల బుధవారం ఎస్టీయూ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సురగాని లింగయ్య, పుట్టపాక నరసింహారావు, నాయకులు బుధవారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు.

విద్యార్థుల నృత్య ప్రదర్శన



బహుమతులతో విద్యార్థులు

కోదాడ : దేవీ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా కోదాడ పట్టణంలోని రామాలయంలో కళానికేతన్ నృత్య అకాడమీ విద్యార్థులు శాస్త్రీయ నృత్యాన్ని ప్రదర్శించారు. ఈ సందర్భంగా వారికి బహుమతులు అందజేశారు.

వీధులు, డ్రెయినేజీలు శుభ్రం

సాక్షి ఎఫెక్ట్..



వీధిలో గ్రామ పంచాయతీ సిబ్బందితో బ్లీచింగ్ పౌడర్ చల్లిస్తున్న కార్యదర్శి

మునగాల : మండల కేంద్రంలోని విజయరాఘవపురం గ్రామపంచాయతీ పరిధిలో గల 4, 5 వార్డుల్లో డ్రెయినేజీ వ్యవస్థ సక్రమంగా లేకపోవడంతో ఇళ్లల్లోని మురుగునీరు, వర్షపు నీరు వీధుల్లోకి వచ్చి చేరి నడిచేందుకు వీలులేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో బుధవారం సాక్షి దినపత్రికలో 'వీధులు ఇలా.. నడిచేది ఎలా' అనే శీర్షికతో ప్రచురితమైన కథనానికి గ్రామ పంచాయతీ కార్యదర్శి పర్నకోల ఉపేందర్ స్పందించారు. గ్రామ పంచాయతీ సిబ్బందితో మురుగు కాలువలు శుభ్రం చేయించడంతో పాటు వీధుల్లో మొరస పోయించి రాకపోకలకు వీలు కల్పించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు సాక్షి దినపత్రిక యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు.

కనకదుర్గమ్మ జాతరకు వేళాయే



విద్యుద్దీపాల వెలుగుల్లో కనకదుర్గమ్మ ఆలయం

మునగాల : మండల కేంద్రంలోని శ్రీవేంకట కనకదుర్గ దేవాలయంలో గురు, శుక్రవారాల్లో అమ్మవారి జాతర నిర్వహణకు ఆలయ అభివృద్ధి కమిటీ అన్ని ఏర్పాట్లు చేసింది. ఈ సందర్భంగా దేవాలయాన్ని రంగురంగుల విద్యుద్దీపాలతో అలంకరించారు. ఇందులో భాగంగా గురువారం రాత్రి గ్రామంలోని పురవీధుల్లో ప్రభ బండ్ల ప్రదర్శన నిర్వహించనున్నారు. శుక్రవారం ఉదయం బండ్లు అమ్మవారి ఆలయానికి చేరుకున్న తర్వాత గ్రామస్తులు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకుని అనంతరం వనభోజన కార్యకమంలో పాల్గొంటారని ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు దేవరం వెంకటరెడ్డి తెలిపారు. జాతర సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా స్థానిక ఎస్‌ఐ బి.ప్రవీణ్‌కుమార్ సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేయనున్నారు.